క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ కుసుమకుమారి

కురిచేడు: నూతన సంవత్సరానికి సంబంధించి స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని రోహి ప్రార్థన మందిరంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీఓ కుసుమకుమారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలో క్రీస్తు తన కృపా వాక్యం ద్వారా ప్రతిదిన రక్షణ మానవాళికి అందించాలని ఆకాంక్షించారు. దర్శి ఏఎంసీ డైరెక్టర్ ముక్తిపూడి జెమీమా, గోపాలుని పార్వతి, సుబ్బారావు, దైవజనులు డి.కోటేశ్వరరావు, కె.రమేష్, గూడూరి రాంబాబు, రెవ ముక్తిపూడి కిరణ్‌బాబు పాల్గొన్నారు.

పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శామ్యూల్ జాన్ అన్నారు. ప్రభుత్వం పాఠశాలలకు సరఫరా చేసిన టాయిలెట్ సామగ్రిని శనివారం ఆయన పలు పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని బాత్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

రహదారిలో చిల్లకంప తొలగింపు

పెద్దారవీడు: పెద్దారవీడు గ్రామం పడమటిపల్లెలో మంగళివానిగడ్డ నుంచి కస్తూర్బిఆ గాంధీ బాలికల విద్యాలయం వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న చిల్లకంపను జేసీబీ సాయంతో శనివారం తొలగించారు. రహదారికి ఇరువైపులా చిల్లకంప ముసుకుని ఉందని, రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్ దుగ్గెం చెన్నమ్మ దృష్టికి బాలికలు తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ రోడ్డుకు ఇరువైపులా చిల్లకంపతో పాటు గుంతలను మట్టితో పూడ్చించారు. రాకపోకలకు ఇబ్బందిగా లేకపోవడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేశారు.

పాడిగేదెల కొనుగోలుకు రాయితీ రుణాలు

ముండ్లమూరు: పాడిగేదెల కొనుగోలు కోసం 35 శాతం రాయితీ రుణాలు మంజూరు చేయనున్నట్లు వైఎస్సార్ కేపీ దర్శి క్లస్టర్ ఏరియా కోఆర్డినేటర్ వసుంధరాదేవి తెలిపారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో శనివారం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపరిశ్రమపై ఆసక్తి ఉన్న వారికి బ్యాంకుల నుంచి 35 శాతం రాయితీపై రుణాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. డైరీ యూనిట్ ఏర్పాటుకు పది లక్షల వరకు రుణం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగో విడత అమలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నందున మహిళలకు బయోమెట్రిక్ కార్యక్రమాన్ని రెండు రోజుల్లో పూర్తి చేయాలని వీఓఏలను ఆదేశించారు. రుణాల రికవరీపై సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎం హనుమంతరావు, మండల సమాఖ్య ప్రతినిధులు లక్ష్మి, అకౌంటెంట్ మార్తమ్మ, గ్రామ సంఘ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలబడతాం..

గిద్దలూరు రూరల్: జగనన్నకు అండగా నిలబడి రాజకీయ ప్రయాణం కొనసాగిస్తామని గిద్దలూరు నగర పంచాయతీ వైస్ చైర్మన్లు ఆర్‌డీ రామకృష్ణ, కాతా దీపికా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ చైర్మన్లు, కొందరు కౌన్సిలర్లు టీడీపీలో చేరతారని సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను వారు ఖండించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అవాస్తవాలను సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదన్నారు. తమ కౌన్సిల్ మొత్తం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ఇటువంటి పుకార్లను ప్రజలు నమ్మవద్దని కోరారు.

యూటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

తాళ్లూరు (ముండ్లమూరు): స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శనివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నూతన క్యాలెండర్‌ను ఎంఈఓలు సుబ్బయ్య, సుధాకర్‌లు ఆవిష్కరించారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు హనుమారెడ్డి, మండల అధ్యక్షుడు నాగరాజు, నాయకులు కొండయ్య, స్వామిదాసు, శ్రీనివాస్, రమణారెడ్డి, నాగిరెడ్డి, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఖాశింసాహెబ్ పాల్గొన్నారు.

ముండ్లమూరు: మండల విద్యావనరుల కేంద్రం వద్ద శనివారం యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను మండల విద్యాశాఖాధికారులు సుబ్బారావు, వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కావూరి దేవరాజు, మండల ప్రధానకార్యదర్శి గోగుల కోటేశ్వరరావు, నాయకులు శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, లింగారావు, హజరత్‌ఆలీ, రాముడు, వెంకటేశ్వర్లు, సుబ్బరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా



త్రిపురాంతకం: దూపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి

తర్లుపాడు: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు ఉత్సాహంగా.. ఉల్లాసంగా.. సాగుతున్నాయి. యువకులు పోటీల్లో సత్తా చాటేందుకు హోరాహోరీగా తలపడుతున్నారు. ఆటల పోటీలను ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ అబ్దుల్ హమీద్ మండలంలో పలు సచివాలయాల పరిధిలో తిరిగి పర్యవేక్షించారు. సర్పంచ్‌లు, సచివాలయం అధికారులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు. మీర్జపేట జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్రికెట్ పోటీలను మండల వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు మీరయ్య, రామిరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పార్వతీ రమేష్‌రెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, వెలుగొండారెడ్డి, కాశయ్య, శేషయ్య సమక్షంలో టాస్ వేసి ప్రారంభించారు.

■ **పెద్దదోర్నాల:** మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఐదో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగు సచివాలయాల పరిధిలోని క్రీడాకారులకు శనివారం ఖోఖో పోటీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మోహనరావు, ఫిజికల్ డైరెక్టర్ పి.రామానాయక్ పాల్గొన్నారు.

■ **బేస్తవారిపేట:** మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శనివారం ఐదో రోజు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, డబుల్స్ బ్యాడ్మింటన్ పోటీల్లో యువతీ, యువకులు పాల్గొన్నారు. పిటికాయగుళ్ల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగే పోటీలను ఎంపీడీఓ పార్వతి, ఎంఈఓ రమణారెడ్డి, పూసలపాడులో జరిగే పోటీలను తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పరిశీలించారు.

■ **గిద్దలూరు రూరల్:** ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాదలకుంటపల్లె, ముండ్లపాడు, తిమ్మాపురం, కంచిపల్లె, గడికోట, సంజీవరాయుడుపేట గ్రామాల్లో శనివారం ఆటల పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. నగర పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదర్శ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలు నిర్వహించారు. కార్యదర్శులు వెంకటేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు, శంకర్‌రెడ్డి, నాగసుధ, రమణానాయక్ పాల్గొన్నారు.

■ **పుల్లలచెరువు:** ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు మండలంలో ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం పుల్లలచెరువులో క్రికెట్ పోటీలు జరిగాయి. పేర్లు నమోదు చేసుకున్న అన్ని జట్లకు పోటీలు నిర్వహించినట్లు కార్యదర్శి బాలునాయక్ తెలిపారు. గెలిచిన వారిని మండలస్థాయిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ **త్రిపురాంతకం:** ఆడుదాం ఆంధ్రలో భాగంగా గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దూపాడులో క్రికెట్ పోటీలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. తహసీల్దార్ వి. కిరణ్, ఎంపీడీఓ సాంబశివరావు, ఎంఈఓ-2 టి.రాజశేఖరరెడ్డి, ఆర్ఐ ముకుందహరి, ఈఓ ఆర్‌డీ మురళీమోహన్, పీఎస్ వై.శ్రీనివాసరావు, సర్పంచ్ శైలజ, ఎంపీటీసీ శార, వైఎస్సార్ సీపీ నాయకులు రోగయ్య, రమణారెడ్డి, మస్తాన్, ఎస్‌వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బేస్తవారిపేట: వాలీబాల్ ఆడుతున్న యువకులు

■ **మార్కాపురం టౌన్:** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, ఎస్‌వీకేపీ కళాశాల ఆవరణలో, ఇండోర్ స్టేడియం, సచివాలయాల పరిధిలో ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రాలో భాగంగా యువతీ యువకులు క్రీడాకారులు వివిధ క్రీడల్లో గురువారం పాల్గొన్నారు. క్రీడల్లో భాగంగా వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని పోటాపోటీగా తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.

■ **దర్శి:** మండలంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలు శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో షటిల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు. బాలికలు, బాలురకు విడివిడిగా పోటీలు నిర్వహించారు. కురిచేడు రోడ్డులోని మాదాసు పోలేశ్వరరావు షటిల్ కోర్టులో షటిల్ పోటీలు నిర్వహించారు. క్రీడలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వచ్చారు.

■ **యర్రగొండపాలెం:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు జరిగాయి. సచివాలయం-3 పరిధిలోని యువకులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. 2024 జనవరి 10వ తేదీన జరిగే మండల స్థాయి క్రికెట్ పోటీల్లో తమ సచివాలయానికి చెందిన టీం గెలుపొందుతుందని ఆ సచివాలయ కార్యదర్శి సతీష్‌కుమార్ తెలిపారు.

■ **ముండ్లమూరు:** క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎంపీడీఓ బి.శంకరరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించి ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదు రకాల ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆశక్తి ఉన్న క్రీడాకారులు ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని బహుమతులు పొందొచ్చన్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో ఆడుదాం..ఆంధ్రా ఆటల పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయని తెలిపారు. యువతతో పాటు స్థానిక మహిళలు పోటీల్లో పాల్గొనం అభినందనీయమన్నారు.

■ **కొనకనమిట్ల:** 'ఆడుదాం ఆంధ్ర' ద్వారా క్రీడా పోటీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేయటం అభినందనీయమని ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్ అన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెదారికట్ల, చినారికట్ల, సిద్ధవరం, రేగుమానిపల్లి సచివాలయాల పరిధిలో ఆటల పోటీలు నిర్వహించగా యువతీ, యువకుల ఉత్సాహం నడుమ విజయవంతంగా కొనసాగాయి. పోటీలను ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించి పోటీలను తిలకించారు. ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి, ఎంఈఓలు డాంగేషరీఫ్, బి.నరసింహారావు, తహసీల్దార్ షాజిదా, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి నుసుం బాలచంద్రుడు, రేగుమానిపల్లి సర్పంచ్ బోయిన వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.



పెదారికట్లలో క్రికెట్ పోటీలకు వచ్చిన యువకులు



వై.పాలెంలో క్రికెట్ ఆడుతున్న యువకులు



ముండ్లమూరు: పసుపుగల్లులో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మార్కాపురం: కబడ్డీ ఆడుతున్న మహిళలు

బూచేపల్లి నూతన సంవత్సర శుభాకాంక్షలు

కురిచేడు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు జిల్లా ప్రజలకు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సకాలంలో వరుణుడు కరుణించి వర్షాలు కురిసి పాడిపంటలు అభివృద్ధి చెందాలని, జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తమ ప్రతినిధులు సందిరెడ్డి నరేంద్రరెడ్డి, కొండారెడ్డిల ద్వారా మండలంలోని నాయకులు, విలేకరులకు మిఠాయిలు, క్యాలెండర్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సొసైటీ ప్రెసిడెంటు పోతిరెడ్డి నాగిరెడ్డి, కురిచేడు, పడమరవీరాయపాలెం సొసైటీ మాజీ ప్రెసిడెంట్లు గోగులముడి లింగారెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, నాయకులు నారు శ్రీనివాసులరెడ్డి, బొరిగర్ల చిన గోవిందు, నుసుం రామిరెడ్డి ఉన్నారు.



క్యాలెండర్లతో నాయకులు

న్యూ ఇయర్ వేడుకలకు తరలి రావాలి

దొనకొండ: దర్శిలోని బూచేపల్లి నివాసంలో జనవరి 1వ తేదీ వేడుకలకు గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తరలి రావాలని సలహాదారులు కొండారెడ్డి, నరేంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డిలు జనవరి వేడుకలకు తమ నివాసంలో అందుబాటులో ఉంటారని వారు పేర్కొన్నారు.

పట్టణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

మార్కాపురం టౌన్: మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే సూచనల మేరకు పట్టణంలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులను కల్పించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అమరజీవి పొట్టి శ్రీరాములు హాలులో చైర్మన్ కృష్ణ అధ్యక్షతన జరిగింది. చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ ముందుగా కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులకు, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. వ్యాధులు రాకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. పట్టణంలో అన్ని వార్డుల్లో నీరు, లైట్లు, రోడ్లు, డ్రైనేజీ కాల్వలు తదితర మౌలిక వసతులను కల్పించేందుకు కౌన్సిలర్లందరూ సహకరించాలని కోరారు. ప్రాధాన్యత క్రమంలో వార్డుల్లో అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో సుమారు 12 మంది అటెండర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, ఇంత మంది అవసరముందా అని.. వీరిని మున్సిపల్ కార్యాలయ పనులకు సర్దుబాటు చేయాలని కౌన్సిలర్ కొత్త కృష్ణ చైర్మన్‌ను కోరారు. వార్డులో పైపులైన్లు ఏర్పాటు చేయాలని అనేక సమావేశాల్లో కోరినా స్పందించడం లేదని కౌన్సిలర్ దొడ్డ భాగ్యలక్ష్మి చైర్మన్‌ను కోరారు. వార్డులో ప్రజలు నీటికోసం ఇబ్బందులు పడుతున్నారని, వార్డు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని చైర్మన్‌ను కోరారు. మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, మేనేజర్ శ్రీనివాసన్, డీఈ సుభానీ, ఆర్ఓ రంగారావు, వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ చిర్లంచర్ల కృష్ణ

ఘనంగా శాంతి కల్యాణం

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి వారి శాంతి కల్యాణం అర్చకులు శనివారం వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మ వారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రత్యేక పూల అలంకరణలో ఉభయ దేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేద మంత్రాల మధ్య చెన్నకేశవ స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. చెన్నకేశవుని శాంతి కల్యాణానికి ఉభయదాతలు కల్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణాన్ని భక్తుల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ ఈవో జి. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి. కేశవరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు

యర్రగొండపాలెం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. శనివారం వాదంపల్లి, వీకే నగర్ నగర్‌లలో విద్యార్థులు కేక్ కట్ చేసి నూతన సంవత్సరాన్ని ఆహ్వానించారు. ఇటువంటి వేడుకలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని, ఆనందాన్ని, సహాయ గుణాన్ని కలిగిస్తాయని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. పద్యాలు, పేయింటింగ్, గ్రీటింగ్ కార్డుల పోటీలు నిర్వహించారు. స్వీట్‌లు, చికెన్, పులావు అందించారు. వంటలక్కలు, ఆయాలకు చీరలు పంపిణీ చేసిన హెడ్మాష్టర్లు నాగరాజు, శామ్యూల్‌లను అభినందించారు. సైన్స్‌ఫేర్‌లో గెలుపొందిన ముగ్గురు విద్యార్థినులకు రూ.1000 చొప్పున అందచేశారు. సైన్స్‌ఫేర్‌లో పాల్గొన్న 50 మందికి రూ.5 వేలు విలువ చేసే బహుమతులను వాదంపల్లి గ్రామ పూర్వ విద్యార్థి, ఎన్ఆర్ఐ లక్ష్మీనారాయణ అందచేశారు. ఎంఈవో-2 మల్లూనాయక్, పుల్లలచెరువు ఎంఈవో ఇందిరా ప్రసాద్, మిల్లంపల్లి సర్పంచ్ జయమ్మ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా రేడియో ఉద్యోగి పదవీ విరమణ

మార్కాపురం: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని, విధి నిర్వహణలో ఉద్యోగి ప్రవర్తన, సేవలు ఆదర్శంగా ఉండాలని మార్కాపురం ఆకాశవాణి కేంద్ర కార్యక్రమ నిర్వాహణాధికారి ప్రశాంత్ కిరణ్ అన్నారు. మార్కాపురం ఆల్ ఇండియా రేడియోలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఓబన్న శనివారం పదవీ విరమణ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. ఇంజినీరింగ్ అధికారులు కోటేశ్వరరావు, పీఎస్ రవికుమార్, ప్రసాద్ తదితరులు ఓబన్న సేవలను గుర్తుచేశారు. వెంకటేశ్వరరెడ్డి, సాల్మన్, నారాయణ, ఈశ్వరయ్య, శ్రీనివాస్, సహదేవ్, గాలెయ్య పాల్గొన్నారు.



ఓబన్నను సన్మానిస్తున్న ప్రశాంత్ కిరణ్, సిబ్బంది

అయోధ్య అక్షతలతో హిందువుల ర్యాలీ

గిద్దలూరు రూరల్: అయోధ్య రామమందిరం నిర్మాణం సందర్భంగా హిందువులు పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయం నుంచి వేణుగోపాలస్వామి ఆలయం వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ దేవాలయాల కమిటీ కన్వీనర్ చేరెడ్డి ఎర్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి హిందువు వద్దకు అయోధ్య అక్షతలు చేరతాయని చెప్పారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు బూజుమేకల రాజు, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య, అభయాంజనేయస్వామి ఆలయం కమిటీ అధ్యక్షురాలు పాలుగుళ్ల అనసూయ పాల్గొన్నారు.

జగనన్న విద్యాదీవెనకు రూ. 3.24 కోట్లు విడుదల

మార్కాపురం: జగనన్న విద్యాదీవెన పథకం కింద మార్కాపురం నియోజకవర్గంలోని డిగ్రీ, ఇంజినీరింగ్, మెడికల్, పీజీ, ఇతర కోర్సులు చదువుతున్న మొత్తం 4,479 మంది విద్యార్థులకు 3,24,85,681 రూపాయలు నిధులను ప్రభుత్వం విడుదల చేసినట్లు మార్కాపురం సహాయ సాంఘిక సంక్షేమ అధికారిని ఎం. అరుణ తెలిపారు. మొత్తం 98 కళాశాలల్లో చదువుతున్న 4,102 తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమచేస్తున్నట్లు తెలిపారు. ఉన్నత చదువులు చదువుకొని తమ లక్ష్యాలను చేరుకునేందుకు జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో ప్రభుత్వం నిధులను విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు

కంభం: సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మడంగానీ, నిల్వ ఉంచడంగానీ చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ప్రసాద్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోల్‌సేల్ దుకాణాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ వాడకంపై నిషేధం అమల్లో ఉందని, నిబంధనలను ఉల్లంఘించిన వారికి జరిమానా విధించడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, సర్పంచ్ పల్నాటి బోడయ్య, కార్యదర్శి బ్రహ్మయ్య, సచివాలయ కార్యదర్శి ఖాదర్ వలి పాల్గొన్నారు.

న్యూ ఇయర్ వేడుకలు నిరాడంబరంగా నిర్వహిద్దాం..

గిద్దలూరు రూరల్: నూతన సంవత్సర వేడుకలను నిరాడంబరంగా నిర్వహిద్దామని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని ప్రజలందరికీ ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను తన అనారోగ్యం కారణంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య నిర్వహించలేకపోతున్నానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరం నూతన ఉత్సాహంతో అండగా నిలబడదామని ఆయన పిలుపునిచ్చారు.

హద్దుదాటితే కఠిన చర్యలు

మార్కాపురం: నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించే వేడుకల్లో హద్దుదాటి ప్రవర్తించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వీరరాఘవరెడ్డి హెచ్చరించారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ట్రైనీ డీఎస్పీ షెహవాజ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు లైసెన్సులేనిదే వాహనాలు ఇవ్వొద్దని, ఇంటినుంచి బయటకు వచ్చిన తరువాత గమనించాలన్నారు. మద్యం సేవించి, బైకులకు సైలెన్సర్లు తీసి హారన్లు మోగించుకుంటూ తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. క్రిమినల్ కేసు నమోదుచేయడం వలన ఉద్యోగాల్లో ఇబ్బందులుపడే అవకాశం ఉన్న విషయాన్ని గమనించాలన్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. రెస్టారెంట్లు, బార్లు నిబంధనల ప్రకారం వ్యవహరించకుంటే వారిపై కూడా కఠిన చర్యలు తప్పవన్నారు. సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

తర్లుపాడు: న్యూ యియర్ జరిగే వేడుకల్లో యువత ప్రశాంతంగా పాల్గొని సంతోషంగా జరుపుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన తర్లుపాడులో విలేకరులతో మాట్లాడుతూ మద్యం సేవించి, రోడ్డుపై కేకలు వేసుకుంటూ, ఇష్టం వచ్చినట్లుగా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు సెయింటాన్స్ ఇంగ్లిషు మీడియం స్కూల్, కేజీబీవీ పాఠశాలలో శనివారం ముందస్తు న్యూ ఇయర్ వేడుకలు ఉత్సాహంగా జరిపారు. సెయింటాన్స్ పాఠశాలలో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకల్లో పాఠశాల డైరెక్టర్లు పి.నారాయణ, రమణల పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు న్యూ ఇయర్ కేక్ కట్ చేసి హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు.

గ్రామాల్లో నీటి ఇబ్బందులు తొలగించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గుమ్మా పద్మజ

పెద్దదోర్నాల: గ్రామాల్లో నెలకొన్న నీటి ఇబ్బందులను తొలగించాలని ఎంపీపీ గుమ్మా పద్మజ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తొలగించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పరుచూరి సురేఖతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

అంతా సంతోషంగా ఉండాలి

మార్కాపురం: నూతన సంవత్సరంలో అందరూ హ్యాపీగా ఉండాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ఆకాంక్షించారు. ఎ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలండర్, డైరీని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వారు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ మీనా, షంషేర్

మద్యం బాటిళ్ల స్వాధీనం

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరం గ్రామానికి చెందిన బత్తిన రమాపతి అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రమాపతి అనే వ్యక్తి మద్యం బాటిళ్లను తరలిస్తున్నాడని సమాచారం అందడంతో పట్టణంలోని చిన్న మార్కెట్ వద్ద అతడిని అదుపులోకి తీసుకుని సోదాలు చేశారు. అతడి వద్ద 70 మద్యం బాటిళ్లను గుర్తించారు. అతడిని అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని శివరామపురంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న బెల్ట్ షాపు నుంచి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వైవీ రమణయ్య తెలిపారు. గ్రామానికి చెందిన బొగ్గుల వెంకాయమ్మ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఆయన తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. దాడిలో షాపులో దాచిన 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.

కోవిడ్‌తో జాగ్రత్త

పొదిలి రూరల్: కోవిడ్ కొత్త వేరియంట్ జేఎన్-1పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన డాక్టర్ సౌజన్య సూచించారు. కోవిడ్ క్రమంగా విస్తరిస్తూ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో ఏర్పడుతున్న భయాలను తొలగించడానికి, వారికి ఆరోగ్య భద్రతను కల్పించడానికి, వైరస్‌ను నిర్ధారించడానికి వైద్య, ఆరోగ్యశాఖ వేగవంతమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జేఎన్-1 లక్షణాలు సాధారణంగా కోవిడ్-19 వేరియంట్‌కు అనుగుణంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా జ్వరం, దగ్గు, గొంతునొప్పి, వణుకు, వాసన గుర్తించక పోవడం, ఒళ్ళు నొప్పులుగా ఉంటాయని చెప్పారు. అందువల్ల ప్రజలు రాబోయే పండగ సీజనులో శ్వాసకోశ పరిశుభ్రత నిబంధనలను పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం, మాస్క్‌లు ధరించడం, వ్యక్తుల మధ్య భౌతిక దూరం పాటించాలని, సామూహిక కార్యక్రమాలు నియంత్రించడం చేయాలని తెలిపారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ కోవిడ్‌కు సంబంధించిన లక్షణాలు లేవన్నారు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

కొమరోలు: ఎన్ఆర్ఈజీఎస్ పనులపై శనివారం సామాజిక తనిఖీ నిర్వహించారు. 2022 ఏప్రిల్ 21 నుంచి 2023 మార్చి 41 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై 15వ విడత సామాజిక తనిఖీ చేశారు. డీఆర్‌పీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ శేషగిరిరావు మాట్లాడుతూ ఆడిట్‌లో 795 పనులకు 7,66,75,221 రూపాయలకు ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. రికార్డులన్నీ అప్పజెప్పినట్లు పేర్కొన్నారు. ఆదివారం నుంచి బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో పర్యటిస్తూ తనిఖీలు చేస్తారని చెప్పారు.